www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 15 డిసెంబర్ 2025

5



వైఎస్ఆర్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సభాభవన్‌లో సోమవారం నిర్వహించనున్నామని డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవ లను వినియోగించుకోవాలని డిఆర్‌ఒ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీల ఇప్పటికే పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమ్మయ్యగారిపల్లెకు రాజకీయ సెగ

- టిడిపిలో మరో రెండు కుటుంబాలు చేరిక
- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జికి వినూత్న నిరసన
- గ్రామస్తులు మూకుమ్మడిగా ఇళ్లకు తాళాలు
- శాంతిభద్రతల పేరిట పోలీసుల మోహరింపు



ఇంటికి తాళం వేసిన గ్రామస్తులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని పులివెందుల నియోజకవర్గం వేంపల్లి మండలంలోని అమ్మయ్యగారిపల్లికి రాజకీయ సెగ తగిలింది. మాజీ ముఖ్యమంత్రి కీ.శే వైఎస్ఆర్ హయాం నుంచి వైఎస్ జగన్ హయాం వరకు అమ్మయ్యగారిపల్లి మొత్తం ఒక్కతాటిపై నిలుస్తూ వైఎస్ కుటుంబం వెంట నడుస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కడపలో నివాసం ఉంటున్న అమ్మయ్యగారిపల్లికి చెందిన ఓ న్యాయవాది టిడిపిలో చేరడానికి తన స్వగ్రామానికి చెందిన రెండు కుటుంబాలను సిద్ధం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిలో చేరిన మూడు కుటుంబాలతో కలిపి లెక్కిస్తే తాజాగా చేరిన రెండింటితో కలిపి ఐదు కుటుంబాలు చేరినట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగా ఆదివారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి ఆదివారం టిడిపికి మద్దతు తెలిపిన కుటుంబాలను పార్టీలోకి చేర్చుకోవడానికి బయల్దేరారు. అమ్మయ్యగారిపల్లికి చెందిన 80 కుటుంబాల్లో 75 కుటుంబాలు వినూత్న నిరసనకు శ్రీకారం చుట్టాయి. టిడిపిలో చేరిన ఐదు కుటుంబాలకు, వారిని ఆహ్వానించడానికి హాజరవుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాకకు నిరసనగా గ్రామీణులందరూ ఇళ్లకు తాళాలు వేశారు. దీంతో అమ్మయ్యగారిపల్లి నిర్మానుష్యంగా మారింది. కమలాపురం నియోజకవర్గ పరిధిలోని పెండ్లిమర్రి మండలం నందిమండలం సమీపంలోని కొండగంగమ్మ ఆలయానికి చేరుకుని వనబోభనాల పేరిట విందు ఏర్పాటు చేసుకుని ఆరగించడం చర్చనీయాంశంగా మారింది. వైసిపి ఏర్పాటు చేసిన విందుకు వెళ్తున్న పలువురు గ్రామీణుల్ని పోలీసులు అమ్మయ్యగారిపల్లిలో ఏర్పాటు చేసిన విందుకు ఉండాలని అడ్డంకులు సృష్టించినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందనే వాదన వినిపించింది. అనంతరం వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి సతీష్‌రెడ్డి కొండగంగమ్మ ఆలయ పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన వనభోజన విందుకు హాజరై గ్రామీణుల ఐకమత్యాన్ని ప్రశంసించారు. అమ్మయ్యగారిపల్లి గ్రామీణులు చూపించిన తెగువ పార్టీకి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కొనియాడారు. వైఎస్ జగన్ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని కోరుకుంటున్నారని తెలిపారు. టిడిపి నాయకులు మాత్రం పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రలోభాలతో ప్రజల నుంచి నాయకుల వరకు అందరినీ ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించడం గమనార్హం.

ఒంటిమిట్ట, సిద్ధవటంను కడప జిల్లాలోనే ఉంచాలి

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



దీక్షలకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సంఘీభావం తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు సంఘీభావం దీక్షా శిబిరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రజల ఆకాంక్ష మేరకే ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడప రెవెన్యూ డివిజన్‌లో చేర్చారని చెప్పారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దురుద్దేశంతోనే రాజకీయ కక్షతో నేడు తిరిగి ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను అన్నమయ్య జిల్లాల్లో కలపడం తగదని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినప్పటికీ ప్రజల బాగోగులే మనకు అవసరమని పేర్కొన్నారు. రాజకీయాలలో కక్ష సాధింపులు ఉండకూడదని తెలిపారు. ఒంటిమిట్టకు ఒక చరిత్ర ఉందని అదే, సిద్దవటం మండలానికి కూడా ఒక గొప్ప పురాతన చరిత్ర ఉందని చెప్పారు. ఒంటిమిట్ట జెఎసి నాయకులు నిర్వహిస్తున్న కార్యక్రమానికి రవాడం తాను ఎంతో గర్విస్తున్నానని అన్నారు. ఎట్టి పరిస్థితులలో ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను యధా స్థితిలో ఉంచేందుకు పోరాటం చేస్తామని అన్నారు. ఒంటిమిట్ట సిద్ధపటం జేఏసీ నాయకులకు ప్రజలకు తమ మద్దతు పూర్తిగా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఉద్యమం చేపట్టి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జడ్‌పి వైస్ చైర్మన్ ఎరగం రెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఒంటిమిట్ట, సిద్ధపటం మండలాలను తిరిగి కడపలో చేర్చేంతవరకు ఉద్యమం చేపడతామని అన్నారు. ఇక్కడ రాజకీయాలు ముఖ్యం కాదని ప్రజలే అవసరాలే అన్నారు. వైసిపి సీనియర్ నాయకులు రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి ఒంటిమిట్టను నిలబెట్టుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పెన్న పేరు రూరు ఎంపిటిసి, నారాయణరెడ్డి. మండల వైసిపి అధ్యక్షులు శివారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రవిచంద్రరాజు , రామిరెడ్డి, మాధవరం సర్పంచ్ పన్నీరు, మాధవరం సర్పంచ్ పన్నేల చంద్ర, మురళి సాలాబాద్ మాజీ ఎంపిటిసి శ్రీనివాసరెడ్డి, మెరువ శివ నారాయణ .దనంతరంపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, రాచపల్లి గురుమోహన్‌రాజు, వైసిపి నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

నేడు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి

ప్రజాశక్తి - కడప

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న ఉదయం 10. గంటల నుంచి మధ్యాహ్నం 12. గంటల వరకు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారమూ నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 8977716661కు ఫోన్ చేసి తమ విద్యుత్ సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సుబ్బరాయుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర సివిల్ సప్లంయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిట్టిబోయిన సుబ్బరాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాల వేసి అభినందించారు. పదవిలో రాణించాలని ఆకాంక్షించారు.

క్రికెట్ ఛాంపియన్‌గా కడప మండల జట్టు

ప్రజాశక్తి - కడప

కడప డివిజనల్ లెవెల్ ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల విజేతగా కడప మండల జట్టు నిలిచింది. ఆదివారం మధ్యాహ్నం కడప నగరంలోని కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో డివిజనల్ లెవెల్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన చింతకొమ్మదిన్నె జట్టు నిర్ణీత 15 ఓవర్‌లలో 94 పరుగులు చేసింది. అనంతరం 95 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన కడప జట్టు 13.2 ఓవర్లలోనే 6 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. జట్టులోని మహబూబ్‌బాషా 36 పరుగులతో రాణించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన కడప జట్టును విద్యాశాఖ అధికారుల అభినందించారు. డివిజనల్ లెవెల్ ట్రోఫీని చింతకొమ్మదిన్నె, వల్లూరు, పెండ్లిమర్రి ఎంఇఒలు రమాదేవి, విజయ రెడ్డి, నాయక్ విజేత జట్టుకు ట్రోఫీ అందించి అభినందించారు.



విజేతగా నిలిచిన కడప మండల జట్టు

బాల విహార్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని సాయిపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆకాశవాణి కడప కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాలవిహార్' కార్యక్రమంలో ప్రత్యేక ప్రదర్శన ఇచ్చి మన్ననలు పొందారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాది నాగరాజు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు బాలవిహార్ కార్యక్రమంలో వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తూ, నీతి కథలు, దేశ నాయకుల స్ఫూర్తిగాథలు, దేశ భక్తి గేయాలు, వేమన శతకాలు, సుమతి శతకాలు, జోక్స్, సామెతలు ఇలా వివిధ రకాల కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు మాట్లాడుతూ ఆకాశవాణి కడప కేంద్రాన్ని సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. అవకాశం కల్పించిన విద్యాశాఖ అధికారులు, ఆకాశవాణి కడప స్టేషన్ డైరెక్టర్ చుండూరు మహేష్‌కు ధన్యవాదములు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఆకాశవాణి కడప కేంద్రం నుంచి ప్రసారమైంది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.ఎం.డి.అసీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బిసిలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి- కడప

స్థానిక సంస్థలు, చట్ట సభలలో బిసిలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిసి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందనాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. కడప జిల్లా బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బిసిలు ఎదురుకుంటున్న సమస్యల పై చర్చించారు. అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ చిట్టిబోయిన సుబ్బరాయుడు, నగర మార్కెట్‌యార్డు డైరెక్టర్ చితరి నరసింహను సనామించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ బిసిల అభివృద్ధికి తమ వంతు సహకారం అందచేస్తామని తెలిపారు. కడప నగర కమిటీ అధ్యక్షులుగా, గొడుగు హరికుమార్, ప్రధాన కార్యదర్శిగా, మేకల సురేంద్రను జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యక్రమంలో బిసి సంగ: జిల్లా అధ్యక్షులు బత్తాల లింగ మూర్తి, గౌరవ అధ్యక్షులు పత్తురు గురు స్వామి, జిల్లా కార్యదర్శి, ములకాని త్రివిక్రమ్, ఉపాధ్యక్షులు, చేలో రవి, శ్రీనివాసులు, సుబ్బారాయుడు, కళ్యా సుధాకర్, కోశాధికారి సాదుశెట్టి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు, సూర్యుడు, బాల సురేష్, తానేష్, వేణుగోపాల్, పాల్గొన్నారు.



డైరెక్టర్లను సన్మానిస్తున్న బిసి సంఘం నాయకులు

నెహ్రూ పార్కు అభివృద్ధికి చర్యలు

మేయర్ పాకా సురేష్



పార్కు అభివృద్ధిపై అధికారులతో చర్చిస్తున్న మేయర్ పాకా సురేష్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగర వాసులకు ఉపశమనాన్ని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెహ్రూ పార్కు కల్గిస్తుందని మేయర్ పాకాసురేష్. పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి సందర్శించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా పార్క్ పరిసరాలను, వాకింగ్ ట్రాక్, పచ్చదనం, మౌలిక సదుపాయాల పరిస్థితిని మేయర్ స్వయంగా పరిశీలించారు. పార్క్‌కు నిత్యం వాకింగ్‌కు వచ్చే వారు, యోగా చేసే వారు మేయర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. పార్క్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలని, మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ప్రజల అభిప్రాయాలను గమనించిన మేయర్ నెహ్రూ పార్క్‌ను నగరానికి గర్వకారణంగా తీర్చిదిద్దాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. అనంతరం సంబంధిత మున్సిపల్ అధికారులను అక్కడికక్కడే పిలిపించిన మేయర్ ఇప్పటికే నెహ్రూ పార్క్ అభివృద్ధికి మంజూరైన రూ. 75 లక్షల నిధులతో వెంటనే టెండర్ ప్రక్రియ చేపట్టి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. టెండర్ ప్రక్రియకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా అవసరమైన చిన్నచిన్న అభివృద్ధి పనులు, పార్క్ పరిశుభ్రత, లైటింగ్, అలాగే తాగునీటి సదుపాయాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పార్క్ మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు దాతలు ముందుకు వచ్చి బెంచీలఏర్పాటు, సాంస్కృతిక విలువలు ప్రతిబింబించే విధంగా ఘంటసాల విగ్రహం ఏర్పాటు అంశాలపై చర్చించాలని మేయర్ సూచించారు. విషయంలో అక్కడ ఉన్న డాక్టర్లు, పట్టణ ప్రముఖులతో సంప్రదించి ముందడుగు వేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇఇ ధనలక్ష్మి, డిఇ దిల్షాద్, ఎఇ శ్రీకాంత్, నాయకులు బాలస్వామిరెడ్డి, పులి సునీల్ కుమార్, జయచంద్ర రెడ్డి, గుంటీ నాగేంద్ర, మునిశేఖర్, ఫైజల్ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి



విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - బద్వేలు

ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించే సిఐటియు 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక 2వ వార్డు, శ్రీజాంబవంతనగర్‌లో ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు మాట్లాడుతూ మహాసభలకు దేశ వ్యాప్తంగా 2 వేల మంది కార్మిక ప్రతినిధులు, 10 దేశాల నుంచి కార్మిక సంఘాల నాయకులు హాజరు కానున్నారన్నారన్నారు. జనవరి 4న లక్ష మందితో బహిరంగ సభ జరగనుందని తెలిపారు. మహాసభల సందర్భంగా సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. సాంస్కృతిక ఉత్సవాలకు ప్రముఖ సినీ నటులు ప్రకాష్ రాజ్, సుద్దాల అశోక్ తేజ, సింగర్ మంగ్లీ మరి కొంతమంది సిని ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. బద్వేలు పట్టణంలో ఉన్న అన్ని వర్గాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జనవరి 4 న జరగనున్న బహిరంగ సభను, సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కమిటీ సభ్యులు దియ్యాలహరి, కాలువ శివకుమార్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, ఉపాధ్యక్షులు పత్తూరు యువరాజు, మున్సిపల్ యూనియన్ ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో

జిల్లాకు రాష్ట్ర స్థాయి 3వ ర్యాంక్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని

ప్రజాశక్తి - కడప : జాతీయ లోక్ అదాలత్ లో 39,120 కేసులు పరిష్కరించి రూ. 32.43 కోట్ల మొత్తాన్ని కక్షిదారులకు చెల్లించి రాష్ట్ర స్థాయిలో వైఎస్ఆర్ కడప జిల్లా 3వ ర్యాంకు సాధించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని, సీనియర్ సివిల్ జడ్జి, ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. జాతీయలోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 38498 క్రిమినల్ కేసులు, 274 సివిల్ కేసులు, 348 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. కడప లో 4097 కేసులు, ప్రొద్దుటూరులో 2314 కేసులు, రాజంపేటలో 2187 కేసులు, రాయచోటిలో 4372 కేసులు, బద్వేల్‌లో 6476 కేసులు, మైదుకూరులో 2081 కేసులు, జమ్మలమడుగులో 5337 కేసులు, సిద్ధవటంలో 1681 కేసులు, రైల్వేకోడూరులో 1813 కేసులు, పులివెందులలో 2113 కేసులు, నందలూరులో 1032 కేసులు, లక్కిరెడ్డిపల్లిలో 3120 కేసులు, కమలాపురంలో 2497 కేసులు పరిష్కారమ య్యాయన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన వారందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు..తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శివారులో ఉన్న చెరువులోకి ఓ కారు దూసుకెళ్లింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్నూలు పట్టణం నిర్మల్ నగర్‌కు చెందిన చిప్పగిరి శ్రావణ్‌కుమార్, ధనలక్ష్మి, మకా జయప్రకాష్, సుభద్రాదేవి దంపతులు. వారందరూ కారులో తిరుమల దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆదివారం తెల్లవారుజామున స్వగ్రామానికి బయలుదేరారు. దట్టమైన పొగమంచు ప్రభావంతో వీరు ప్రయాణిస్తున్న కారు ఒంటిమిట్ట–రేణిగుంట జాతీయ రహదారి పక్కనే ఉన్న చెరువులోకి తీసుకెళ్లింది. అదే మార్గంలో వెళ్తున్న సిద్దవటం మండలం భాకరాపేట సమీపంలో ఉన్న 11వ బెటాలియన్ ఎస్ఐ రామ్మోహన్ ఈ ప్రమాదాన్ని గమనించారు. కారులో చిక్కుకున్న నలుగురుని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. చెరువులోకి దూసుకెళ్లిన కారును క్రేన్ సాయంతో బయటు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు నగరంలో ర్యాలీ : వైసిపి

ప్రజాశక్తి - కడప

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు నేపథ్యంలో కోటి సంతకాల సేకరణ పూర్తి చేసుకొని జిల్లా కార్యాలయం నుండి కేంద్ర కార్యాలయానికి చేరవేసే కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 న కడప నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, నగర మేయర్ పాకా సురేష్ ఉన్నారు. ఆదివారం కడప నగరంలోని మాజీ డిప్యూటీ సిఎం నివాస కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. వైసిపి జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై కోటిరెడ్డి సర్కిల్, ఎన్‌టిఆర్ సర్కిల్, సెవెన్ రోడ్స్ సర్కిల్, వైఎస్ఆర్ సర్కిల్ (పోస్ట్ ఆఫీస్) వరకు సాగుతుందన్నారు. అంతకుముందు నూతనంగా నియమితులైన మేయర్ పాకా సురేష్‌ను వైసిపి నాయకులు ఘనంగా సన్మానించారు.

స్నేహాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్



అన్నదానం చేస్తున్న దాతలు

నగరంలోని చిన్న ముసల్‌రెడ్డిపల్లె (సిఎం ఆర్‌పల్లి) నివాసి దన్నాసి వెంకట సుబ్బయ్య మొదటి వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన కుమారుడు వెంకట కిషోర్ ఆధ్వర్యంలో ప్రకాష్ నగర్‌లోని స్నేహాలయ నిరా శ్రయుల వసతి గృహంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభకార్యాలు, జన్మదిన వేడుకలు,పెళ్లిరోజులు వాటికి డబ్బులు దుబారగా ఖర్చు చేయకుండా నిరాదారణకు గురైన వృద్ధులకు, నిరా శ్రయులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎపి ఎన్‌జిజిఒ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జిల్లా అధ్యక్షులు

కడప ఎపి ఎన్‌జిజిఒ హోమ్‌లో కడప సీటీ కార్యవర్గ సమావేశం అధ్యక్షులు కంభం చిన్నయ్య, కార్యదర్శి సైలెశ్వేర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిధిలుగా కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి పి.నిత్యపూజయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసన్, జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు హాజరయ్యారు. సీటీ యూనిట్‌లో బదిలీల వల్ల ఖాళీ అయినా 9 పోస్టులకు కార్యవర్గంలో నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిటీ కార్యదర్శిగా ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ జి.సాంబశివరావు, సహా అధ్యక్షులుగా పి.మల్లికార్జునరెడ్డి, ఎం. వెంకట రామరాజు, ఉపాధ్యక్షులుగా వై.అంకిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా జి.వెంకట శేఖరం, పి.సి.రాజేష్ రెడ్డి, జాయింట్‌గా గణేష్ చౌదరి, జాయింట్ సెక్రటరీ (ఉమెన్) గా పి.ఎస్. సంగీత, ట్రెజరర్‌గా విజయకుమార్‌ను ఎన్నుకున్నారు. నగర కార్యదర్శి పని ఒత్తిడి వల్ల నూతన నగర కార్యదర్శిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి టి.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు సి.దస్తగిరి, జిల్లా సంయుక్త కార్యదర్శులు ఎస్.నరసింహారెడ్డి, ఎన్.రాజశేఖర్, డి.పద్మనాభరావు, ఇరామియా, ఎన్‌జిఒ నాయకులు పాల్గొన్నారు.

వైవీయూ బోటనీ స్కాలర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్రం విభాగం స్కాలర్ షేక్ ఖాదర్ బాషకు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. పరిశోధకుడు షేక్.ఖాదర్‌బాష వృక్ష శాఖ ఆచార్యులు పి.ఎస్.షావలిఖాన్, సహ ఆచార్యులు ఎం. మాదక్క పర్యవేక్షణలో 'ది సైకలాజికల్ అండ్ మాలిక్యులర్ రెస్పాన్సెస్ టు డ్రాట్ స్ట్రెస్ ఇన్ సీసమమ్ ఇండికమ్ ఎల్' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. విశ్వవిద్యాలయ విసి మార్గదర్శకాలతో నియమితులైన పరీక్షకుల బోర్డు, వైవా వోస్ కమిటీ సిఫారసుల ఆధారంగా షేక్.ఖాదర్ బాష డాక్టరేట్ కు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎస్.వి. కృష్ణారావు స్కాలర్ ఖాదర్‌కు పిహెచ్‌డి నోటిఫికేషన్ ప్రకటించారు. షేక్.ఖాదర్ బాష రాసిన పరిశోధన పత్రాలు పలు అంతర్జాతీయ, జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా షేక్.ఖాదర్ బాషను అధ్యాపకులు, స్కాలార్లు, విద్యార్థులు అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్ : బోధనేతర కార్యక్రమాల వల్ల ఉపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారననే విమర్శ ఎక్కువగా వినిప్పిస్తోందని, దీనిపై మంత్రి లోకేష్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలో ఆర్ట్స్ కళాశాల నుంచి జడ్‌పి వరకు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేలాదిమంది ఉపాధ్యాయులతో మహా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్‌పి హాల్లో ప్రారంభమైన విద్యా సదస్సులో రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ అర్హత పరీక్ష పై ఆందోళన చెందవద్దని రాష్ట్ర ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేసి 2011 కంటే ముందు ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన వారికి టెట్‌నుంచి మినహాయింపు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలు తీసుకుని సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యా సంవత్సరం మధ్యలో తీసుకొస్తున్న సంస్కరణల వల్ల విద్యా సంవత్సరం కుంటుపడుతోందని పేర్కొన్నారు. ప్రయోగాలు విఫలమవుతున్నాయని తెలిపారు. అవి సత్ఫలితాలు ఇవ్వడం లేదని చెప్పారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు చూస్తుంటే ప్రపంచ బ్యాంకు షరతులకు ఉచిత విద్య నుంచి ప్రభుత్వం తప్పుకునేలా పావులు కదుపుతోందని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం చేయాలని చూస్తుందని హెచ్చరించారు. ఈ విధానం సరి కాదని 117 జీవోకు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన 21వ జీవోను కూడా సవరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్ బాబు, గాజులు నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం రాజు, జోసెఫ్, సుధీర్ బాబు, తిమ్మన్న జనవిజ్ఞాన వేదిక నాయకులు విశ్వనాథం, ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగమేశ్వర్ రెడ్డి, పాలకొండయ్య పాల్గొన్నారు.


టిడిపిలో చేరిన లాయర్ ఈశ్వరరెడ్డితో బీటెక్ రవి

టిడిపి పాలనలో అంతా సుభిక్షం : బీటెక్ రవి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమికి చెందిన టిడిపి పాలనలో రైతులు, ప్రజలు అందరూ సుభిక్షంగా ఉన్నారని పులివెందుల టిడిపి ఇన్‌చార్జి బీటెక్ రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాములూరు పంచాయతీ పరిధిలోని అమ్మగారిపల్లె గ్రామంలో వైసిపికి చెందిన లాయర్ ఈశ్వరరెడ్డితోపాటు ఆయన సోదరులు ఆదివారం టిడిపిలో చేరారు. వీరికి బీటెక్ రవి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి విలేకరులతో మాట్లాడుతూ ఈశ్వరరెడ్డి, ఆయన సోదరులు టిడిపిలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. నెల రోజులుగా వేంపల్లెలో వైసిపికి చెందిన నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరుతున్నారని తెలిపారు. మరిన్ని చేరికలు ఉన్నాయన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో టిడిపి జెండా ఎగుర వేస్తామని పేర్కొన్నారు. ఈనెల 17న వేంపల్లెలో భారీగా వైసిపి నేతలు టిడిపిలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పార్థసారథి రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు యాసిన్, మైనార్టీ నాయకుడు మొహిద్దీన్ గౌస్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా, హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి, వీరభద్ర, ఓబుల్ రెడ్డి, డక్కా రమేష్ పాల్గొన్నారు.

ప్రయివేటీకరణ వైపు విశాఖ ఉక్కు అడుగులు

ప్రజాశక్తి - వేంపల్లె



విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తోందని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ ఉక్కు కర్మాగారంలో 1,590 మంది రెగ్యులర్ ఉద్యోగులకు విఆర్ఎస్ ఇచ్చి ఇంటికి పంపించడం బాధాకరమన్నారు. 5,500 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో 32 విభాగాలను ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించినట్లు విమర్శించారు. ఇందులో ప్రధాన ఉత్పత్తి విభాగాన్ని ప్రైవేటుపరం చేస్తూ టెండర్లు పిలిచారన్నారు. ప్రభుత్వ రంగంలో లేదంటూనే ఆ వైపు అడుగులు వేస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. ఇంత జరుగుతున్నా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం అత్యంత శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు.

21న కలమల్ల శాసన శిల్పిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - చాపాడు

కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో తొలి తెలుగు కలమల్ల శాసన శిల్పిక (ప్రతిరూపం)ను ఈనెల 21న జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఆవిష్కరిస్తున్నట్లు చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ ఆదివారం తెలిపారు. కలమల్ల తొలి తెలుగు శాసనం ఒరిజినల్ ఐదు అడుగుల ఆరు అంగుళాలు ఉండగా ప్రస్తుతం సుమారు నాలుగు అడుగులు మాత్రమే మిగిలి ఉందన్నారు. శాసనం ఎండకు, వర్షానికి భవిష్యత్తులో అంతరించిపోయే దశలో ఉందని హెచ్చరించారు. ఈ శిలాశాసనాన్ని కాపాడాలనే ఉద్దేశంతో రెప్లికాను స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వాహకులు పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కుమార్తె దీపా వెంకట్ సహకారముందన్నారు. సాహిత్యకారులు, రచయితలు, చరిత్రకారులు, కవులు, పురప్రజలు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సినిమాల్లో విలన్ పాత్రకు రెడ్డి పేరు పెడితే సహించం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్


మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

సినిమాల్లో విలన్ పాత్రకు రెడ్డి పేరు పెడితే సహించేది లేదని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్ని తెలుగు సినిమాల్లో విలన్ లేదా నెగిటివ్ పాత్రలకు పదేపదే రెడ్డి అనే కులపేరును జోడిస్తూ చూపించడం పట్ల ఆ కులానికి చెందిన ప్రజలు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని పేర్కొన్నారు. అఖండ-2 సినిమాలో విలన్ పాత్రకు మద్దిరెడ్డి అనే పేరు పెట్టడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. సినిమా అనేది వినోదంతోపాటు సమాజంపై ప్రభావం చూపే శక్తివంతమైన మాధ్యమమని తెలిపారు. కథ అవసరం పేరుతో ఒక వ్యక్తి చేసే దుర్మార్గాన్ని అతని కులంతో ముడిపెట్టడం సరికాదన్నారు. విలన్ అనేది వ్యక్తి స్వభావం వల్ల ఏర్పడే పాత్ర తప్ప, కులానికి ప్రతినిధ్యం వహించదని స్పష్టం చేశారు. రెడ్డి కులం అంటే గుండాయిజానికి మాత్రమే కాదని, రైతులు, సైనికులు, విద్యావేత్తలు, సమాజ సేవకులు, దేశానికి త్యాగం చేసిన అనేక మంది రెడ్డి ఈ సమాజంలో ఉన్నారని గుర్తు చేశారు. అలాంటి కులాన్ని పదే పదే విలన్ పాత్రలతో ముడిపెట్టడం వినోదం కాదన్నారు. ఇది ఏ ఇతర కులంపై ద్వేషంతో చేసిన ప్రకటన కాదని, అన్ని కులాలను గౌరవిస్తూ రెడ్డి కుల గౌరవాన్ని కాపాడాలనే అభ్యంతరం మాత్రమే అని ఆయన స్పష్టం చేశారు. రచయితలు, దర్శకులు, నిర్మాతలు ఇకనైనా ఆ ధోరణిని వెంటనే ఆపి, బాధ్యతాయుతమైన రచన వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు.

క్రైం కార్నర్

బొలెరో వాహనం ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని ములకనగర్ మెట్ట సమీపంలో బొలెరో వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. మండలంలోని నేలటూరు గ్రామానికి చెందిన వీరప్రతాప్ రెడ్డి (62), గోపులాపురం గ్రామానికి చెందిన చిట్టి బయిన పెద్ద ఎల్లయ్య (65) ద్విచక్ర వాహనంపై రైతు కొత్తగా వేసిన పంటను చూసేందుకు రోడ్డు పక్కన వెళ్తుండగా దువ్వూరు నుంచి ప్రొద్దుటూరు వైపు వెళుతున్న బొలెరో వాహనం ఢీకొంది. బొలెరో వాహన డ్రైవర్ తెల్లాకుల రామసుబ్బయ్యను పోలీసులు అరెస్టు చేశారు. ఇతనిది ప్రొద్దుటూరు మండలం ఉప్పరపల్లె. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు పట్టణం ప్రొద్దుటూరు రోడ్డులో కెసి కెనాల్ బంగ్లా వద్ద ఆదివారం మండలంలోని నాగాయపల్లెకు చెందిన పిచ్చిపాటి వీర ప్రభాకర్‌రెడ్డి(38) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ టివిఎస్ చిరంజీవి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మున్సిపాలిటీ కార్మికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహంతోపాటు బాగా కుళ్లిన స్థితిలో రెండు పొట్లేలు కూడా గుర్తించారు. ఈ నెల 11న ఇంటి నుంచి వెళ్లి కనిపించలేదు. మృతుడి భార్య సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సిఐ రమణా రెడ్డి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీ, బైకు ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆదివారం సాయంత్రం స్కూటీ, బైక్ ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరవేటిపల్లె గ్రామానికి చెందిన రైతు హరీష్‌రెడ్డి ముద్దనూరులో నివాసం ఉంటున్నారు. ఆదివారం అరటి పండ్లు అమ్ముకునేందుకు స్కూటీలో వీధి వీధి తిరుగుతూ నాలుగు రోడ్ల వైపు వెళుతుండగా, ముద్దనూరు వెంకటరెడ్డి కాలనీకి చెందిన శివారెడ్డి బైక్‌లో వస్తూ ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీ కొన్నారు. ప్రమాదంలో రైతు హరీష్‌రెడ్డి కాలు విరిగింది. బైక్‌లో వస్తున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

సామాన్యులకు అందుబాటులోలేని కోడిగుడ్డు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



మార్కెట్‌లో కోడిగుడ్ల ధరలు సామాన్యులకు షాకిస్తున్నాయి. ప్రస్తుతం డజన్ కోడి గుడ్ల ధర రూ.80పైనే పలుకుతోంది. ఒక్క కోడి గుడ్డు ధర రూ.8అమ్ముతున్నారు. మాంసం ధరలు అధికంగా ఉండడంతో కోడిగుడ్లు అయినా తిందా మనుకున్నా సామాన్యులకు భారంగా మారింది. ప్రస్తుతం చలి వణికిస్తుండడంతో కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గిందని వ్యాపారాలు పేర్కొంటున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కోడిగుడ్ల ధరలు విపరీతంగా పెరిగాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న జనానికి గుడ్డు ధరల పెరుగుదల గుదిబండలా మారింది. ధరలు పెరగడానికి అనేక కారణాలున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. చలికి కోళ్లు పెద్ద ఎత్తున చనిపోయాయి. క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు మరింత పెరుగుతాయని అంటున్నారు. అలాగే చలి ధాటికి కోళ్లు భారీగా చనిపోతున్నాయి. అందుకే కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గి, డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. ప్రస్తుతం డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో, దాణా ధరలు పెరగడం, ఇతర ఖర్చుల కారణంగా చికెన్ ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. మాంసం ప్రియులు, సామాన్య ప్రజలు కూరగాయల భోజనం చేయడమే ఉత్తమమని భావిస్తున్నారు.

21న యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - చాపాడు

అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని, అందులో భాగంగానే ఈనెల 21న మైదుకూరు పట్టణంలోని డీసీఎల్ ఫంక్షన్ హాల్లో యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా సహ అధ్యక్షులు రవికుమార్ తెలిపారు. ఆ మేరకు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఆయన సమావేశ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాలకులు చిత్తశుద్ధి చూపించడం లేదన్నారు. పాలకుల వైఖరి వల్లే ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. రివర్స్ పిఆర్సీ, ఆర్థిక బకాయిలు, డిఎ చెల్లింపులు లేకపోవడంతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన ఉంటుందని భావించి ఆ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సహకరించారన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలను ఇచ్చారని, వాటి అమలులో చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం సైతం గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తోందని విమర్శించారు. సమావేశానికి ముఖ్యఅతిధులుగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజా, రాష్ట్ర ప్రచురణల విభాగం ఎం. హనుమంతరావు హాజరవుతారని తెలిపారు. ఉపాధ్యాయ లోకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రసన్నలక్ష్మి, మైదుకూరు మండల ప్రధాన కార్యదర్శి బి.శేఖర్, జిల్లా కౌన్సిలర్ వనమాల రాము, యుటిఎఫ్ మఠం మండల అధ్యక్షులు గంగులయ్య, శ్రీనివాసులు, రమణారెడ్డి తిరుపాలయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికే గ్రామ కమిటీలు : జడ్‌పిటిసి



గ్రామ కమిటీలో మాట్లాడుతున్న జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపిని గ్రామ స్థాయిలో బలోపేతంలో చేసేందుకే పార్టీ అధినేత వైఎస్ జగన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలోని 13వ వార్డు గరుగు వీధిలోని పాత బాలికల పాఠశాల సమీపంలో ఎంపిటిసి పద్మా జయలక్ష్మిదేవి, పద్మా రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ గ్రామ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, రోహన్ నాగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి బలో పేతానికి ఆయా వార్డుల పరిధిలో 9 విభాగాలకు సంబంధించి 90 మంది సభ్యులను ఎన్నుకున్నామన్నారు. గ్రామ కమిటీ సమావేశాలకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కమిటీల్లో సభ్యత్వం తీసుకుంటున్నారని తెలిపారు. అన్ని వర్గాల వారికి కమిటీలో సముచిత స్థానం కల్పించి సభ్యులుగా చేర్చినట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా గ్రామ కమిటీలు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ మండల కన్వీనర్ మునీర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిసార్ బాషా, ఎంపిటిసి పద్మా జయలక్ష్మి దేవి, రాజ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ మునీర్, రాఘవయ్య, పద్మా సంపత్ కుమార్, ప్రవీణ్‌కుమార్, కటిక చంద్రశేఖర్, మణి గోపాల్‌రెడ్డి, హబీబుల్లా, బండల షుకూర్, కమతం రాజా, గంగరావు, చలపతి, మోహన్, మదార్ షావలి పాల్గొన్నారు.

వైసిపి ర్యాలీకి తరలి రావాలి : మాజీ ఎమ్మెల్యే

చాపాడు : కడపలో సోమవారం వైసిపి నిర్వహించే ర్యాలీకి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి కడప జిల్లా వ్యాప్తంగా ప్రజలచే నిర్వహించిన కోటి సంతకాల పేపర్లు కడప పార్టీ కార్యాలయం నుండి తాడేపల్లిగూడెం పార్టీ కార్యాలయానికి పంపుటకు నిర్ణయించామన్నారు. భారీ జన సమూహం మధ్య పార్టీ కార్యాలయం నుండి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా మైదుకూరు వైసిపి కార్యాలయం నుండి నాయకులు, కార్యకర్తలు బయల్దేరాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఎఇ

ముద్దనూరు : బొందలకుంట రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు గ్రామంలో ఉన్న విద్యుత్ ఉప కేంద్రంలో అదనంగా 5000 కెవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నట్లు ఆదివారం ఎఇ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. బొందలకుంట విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని చిన్నదుద్యాల, పెద్ద దుద్యాల, బడువారిపల్లి, ఆరవేటిపల్లి బొందలకుంట, దేనేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని ఎఇ కోరారు.

స్థానిక ఎన్నికల్లో ప్రతిచోటా వైసిపి అభ్యర్థి : పిఆర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి చోటా వైసిపి అభ్యర్థిని నిలబెడుతామని ఎమ్మెల్సీ, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోది నారాయణరెడ్డి కాదు.. సూది నారాయణరెడ్డి అంటూ సూది చెక్కుతా అంటూ అసభ్యంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యేకు 2029 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. పెన్నా, చిత్రావతి నుంచి ఇసుక అమ్ము కుంటూ కోట్లకు పడగలెత్తి అహంకారంతో మాట్లా డుతు న్నారన్నారు. అవినీతి సొమ్ముతో ఒక్కో కారు రూ.3 కోట్లు, రూ.4 కోట్లు పెట్టి కొని తిరుగుతూ అవినీతి సామ్రాజ్యాన్ని స్థాపించారన్నారు. పులివెందుల జడ్పిటిసి ఉపఎన్నిక గురించి ఆది నారాయణరెడ్డి మాట్లాడడం సబబుకాదన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గురించి మాట్లాడడం సరికాదన్నారు. ముద్దనూరు ఎంపీపీ ఎన్నికల్లో పేదవారైన ఓసి, బిసి, ఎస్సి ఎంపీటీసీలకు ఉన్న విలువలు కూడా మీకు లేదు, వాళ్లను మీ చెంచాలతో భయపెట్టాలని చూసినా, ప్రలోభాలకు గురిచేయాలని చూసినా లొంగలేదన్నారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగ నియోజకవర్గ ప్రతినిధి సట్టకారు శివ సుబ్రహ్మణ్యం, విశ్వేశ్వరరెడ్డి, రవి, ఆంజ నేయులు, మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని సన్మానిస్తున్న రవిశంకర్ రెడ్డి

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - చాపాడు

రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని వైసిపి రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రవిశంకర్ రెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట నూర్పిడి పనులు ప్రారంభమయ్యాయన్నారు. ప్రభుత్వం నామమాత్రంగా రూ.13వేలతో ధాన్యం సేకరిస్తూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో కొనుగోలు చేపట్టడం లేదన్నారు. దళారులు 8 బస్తాల ధర కేవలం రూ.11 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఈ ఏడాది ఉల్లి రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని ఆయన గుర్తు చేశారు. వరుస తుపాన్లతో రబీలో సాగుచేసిన పంటలు కూడా సరిగా దిగుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. రైతులు విత్తనాలను రెండు మూడు దఫాలు కొనుగోలు చేసి సాగు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల తరపున నిరంతరం పోరాడుతామన్నారు. తన నియామకానికి సహకరించిన వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి నిత్యం పోరాటాలు సాగిస్తామన్నారు.


గ్రంథాలయ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ

గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జిల్లాలోని గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సూచించారు. గ్రంథాలయ చైర్మన్‌గా దాసరి భానుప్రకాష్ నూతనగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రంథాలయ చైర్మన్‌కు ఎమ్మెల్సీ శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ భానుప్రకాష్ మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పనిచేసి మెరుగైన సేవలు అందిస్తానన్నారు. కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఢిల్లీకి బయల్దేరిన బిసిలు

జమ్మలమడుగు : బిసిలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్స్ కలిపించాలని పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగబోయే ధర్నాకు రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నరసింహరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి ఆధ్వర్యంలో విజయవాడ రైల్వేస్టేషన్ నుండి భారీగా బీసీలు బయలుదేరారు. ఆదివారం వారు విజయవాడ నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ మంగళవారం ఢిల్లీలో ధర్నా జరుగుతుందని, దేశవ్యాప్తంగా బిసిలు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలా శివ గోపి, బత్తుల గీత విజయవాడ సిటీ అధ్యక్షురాలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు యలమందయ్య, పలువురు బీసీలు పాల్గొన్నారు.